# తెలంగాణ ప్రజావారధి

ప్రతి అడుగు నిజం వైపు

www.telanganaprajavaradhi.com

తెలుగు దినపత్రిక





హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 01 | శనివారం | 30 - 05 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజిలు : 3




- పదేండ్లు పాలించి కుటుంబ ఆస్తులు పెంచుకున్నరు
- పేదలకు ఇండ్లు ఇవ్వలే.. కానీ ఫాంహౌస్, ప్రగతిభవన్ కట్టుకున్నరు-మంత్రి
- ఉద్యమకారులను విస్మరించిన బీఆర్ఎస్: ఎమ్మెల్యే మందుల సామేల్
- మోత్కూరులో ఎమ్మెల్యే సామేల్ ఆధ్వర్యంలో మహిళా కమిషన్ సభ్యులు శంకరమ్మ, శ్వేతలకు ఆత్మీయ సన్మానం

## ప్రజాపాలనలోనే..

# అమరుల కుటుంబాలకు గుర్తింపు

## ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**ప్రజావారధి/మోత్కూరు**

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అమరుల కుటుం బాలను విస్మరించారని, ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డి అమరులను గుర్తించి వారికి పదవులు ఇస్తున్నారని ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్చార్జి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులుగా నియమితులైన తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ, చాకలి అయిలమ్మ మనుమరాలు చిట్యాల శ్వేతలను శుక్రవారం మోత్కూరులో తుంగ తుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి లక్ష్మణ్ మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వంలో గుర్తింపు లభించడం సంతోషంగా ఉందన్నారు. శ్రీకాంతాచారి ప్రాణ త్యాగంతోనే తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేచిందని, రాష్ట్ర సాధనలో శ్రీకాంతాచారి త్యాగం మరువలేనిదన్నారు. అందెశ్రీ, గద్దర్ లాంటి కవులు, కళాకారులను సీఎం రేవంత్ రెడ్డి గుర్తించి వారికి అన్ని విధాలాగా అండగా నిలిచారన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని, డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తామని ప్రజలను మోసం చేసి కేసీఆర్ మాత్రం ఫాంహౌస్, ప్రగతిభవన్ కట్టుకున్నారని విమర్శించారు. పదేండ్లు అధికారం అనుభవించిన కేసీఆర్ కుటుంబం తమ కుటుంబ ఆస్తులను పెంచుకుని రాష్ట్రాన్ని దివాళా తీయించి అప్పుల పాలు చేసిందని, లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలిపోయిందన్నా రు. పదేండ్లు మేమే రాజులం, మంత్రులం అన్నతీరుగా వ్యవహరించడంతోనే ప్రజలు వారిని ఓడించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు వచ్చాయని, మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీల పెంపు జరిగాయన్నారు. ప్రతి నియోజకవర్గానికి సంవత్సరానికి 3500 ఇంది రమ్మ ఇండ్లు ఇస్తున్నామని, అర్హులకు ఇండ్లు ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంద న్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను, గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులకు ఈ సంవత్సరం అత్యధిక మార్కులు వచ్చాయని, ప్రభుత్వ విద్యాసంస్థలు కార్పొరేటు ధీటుగా పని చేస్తున్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ గురుకులాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలి పారు. తుంగతుర్తి నియోజకవర్గం, మోత్కూరు ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయి స్తానన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రిగా అందుబాటులో ఉంటానని, ఈ ప్రాంత ప్రజల సమస్యలను నాయకులు, కార్యకర్తలు తన దృష్టికి తీసుకవస్తే ప్రత్యేక చొరవతో పరిష్కరిస్తానన్నారు.

## ఉద్యమ కారులను విస్మరించిన బీఆర్ఎస్

## -ఎమ్మెల్యే మందుల సామేల్

అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో పదేండ్లు అధికారంలో



ఉన్న బీఆర్ఎస్ ఉద్యమకారులను విస్మరించి పాలన కొనసాగించిందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణ త్యాగాలను చేస్తున్నారని గుర్తించి యూపీఏ చైర్ పర్సన్ సోనియాగాంధీ అప్పటి కేంద్రమంత్రి చిదంబరంతో 2009 డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన చేయిస్తే ఆనాటి ఆంధ్ర పాలకులు దానిని వ్యతిరేకించారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధనతోనే తమ కుటుంబాలు బాగుపడతాయన్న ఉద్దేశంతో తెలగాణ సమాజం ఉద్యమంలో చురుకుగా పాల్గొని రాష్ట్ర సాధన కోసం ఉద్యమించడంతో 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఇచ్చిందన్నారు. తెలంగాణ చరిత్ర డిక్షనరీలో లేదని మాట్లాడే ఆంధ్ర నాయకులకు అసలు తెలంగాణ చరిత్ర తెలుసా అని ప్రశ్నించారు. ఐటెక్ సిటీ మేమే కట్టామనే నాయకులు భూమి, నీరు, గాలి అన్నీ తెలంగాణవే అయినప్పుడు వారి కట్టిందేందో చెప్పాలన్నారు. బీజేపీ నాయకులు పసలేని వాదనలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని, దేశంలో 12 ఏళ్లుగా అధికారంలో ఉండి దేశానికి ఏం చేశారో చెప్పాలన్నారు. బీజేపీకి రాష్ట్రంలో ఎలాంటి అవకాశం లేదన్నారు. 25 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర ఇందిరాగాంధీది అన్నారు. చాకలి అయిలమ్మ త్యాగాన్ని గుర్తించి హైదరాబాద్ మహిళా యూనివర్సిటీకి చాకలి అయిలమ్మ పేరు పెట్టిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదన్నారు. శ్రీకాంతాచారి, చాకలి అయిలమ్మల త్యాగాలను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు మహిళా కమిషన్ సభ్యులుగా నియామకం చేసిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## న్యాయం కోసం వచ్చే ఆడబిడ్డలకు అండగా ఉంటాం

## -మహిళా కమిషన్ సభ్యులు శంకరమ్మ, శ్వేత



మహిళా కమిషన్ వద్దకు న్యాయం కోసం వచ్చే ఆడ బిడ్డలకు అన్ని విధాలా ఉండగా ఉంటామని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత అన్నారు. బయటకు చెప్పుకోలేని సమస్యలతో ఇబ్బందులు



పడినా వెనకడుగు వేయకుండా న్యాయం కోసం తమ వద్దకు వచ్చిన వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రస్తుత కాలంలో తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో జాగ్రత్తగా ఉండాలని, వారు ఏం చేస్తున్నారో చూడాలన్నారు. అమరుల త్యాగాలను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి తమకు ఇచ్చిన మాట ప్రకారం మహిళా కమిషన్ సభ్యులుగా అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తామన్నారు. తమను సన్మానించిన మంత్రి లక్ష్మణ్, ఎమ్మెల్యే సామేల్‌తో పాటు పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.



తొలుత చాకలి అయిలమ్మ, కాసోజు శ్రీకాంత్‌చారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. గిద్దె రామనర్సయ్య కళాబృందం ఆటాపాటా ఆకట్టుకోగా, శ్రీకాంత్‌చారి ప్రాణత్యాగంపై రామనర్సయ్య పాడిన పాటతో తల్లి శంకరమ్మ కన్నీటిపర్యం తమయ్యారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్నయాదవ్, కాంగ్రెస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, మార్కెట్ చైర్మన్ నూనె ముంతల విమలవెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమ నర్సయ్య, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్లు పేలపూడి వెంకటేశ్వర్లు, గుడిపాటి సైదులు, మార్కెట్ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, మాజీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, జిల్లా కార్యదర్శి అవిశెట్టి అవిలిమల్లు, జిల్లా నాయకుడు డాక్టర్ జి.లక్ష్మి నర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న, బీసు శ్రీకాంత్, పన్నాల శ్రీవిద్య శ్రీనివాస్ రెడ్డి, గన గాని శైలజనర్సింహ, కుర్మిళ్ల ప్రమీలరాములు, మార్కెట్ డైరెక్టర్లు పన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఎండి.సమీర్, పోచం జగన్, విద్యాసాగర్, మహిళా కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షురాళ్లు ముద్దం జయశ్రీ, అన్నెపు పద్మ, పోలినేని ఆనందమ్మ, మంగమ్మ, నాయకులు పరెపాటి యుగంధర్, ఇటికాల చిరంజీవి, మందుల సురేష్, బద్దం నాగార్జునరెడ్డి, గనగాని నర్సింహ, పి.స్వామిరాయుడు, బయ్యని రాజు, ఎడ్ల శ్రీను, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎరసానిపల్లి సందీప్, ఉపాధ్యక్షుడు అవిశెట్టి కిరణ్, బందెల రవి, సుంకిశాల అనిల్, పి.శేఖర్‌చారి తదితరులు పాల్గొన్నారు.



# మంత్రిగారూ..దళితబంధు ఇప్పించండి

## మంత్రి లక్ష్మణ్‌కు దళితబంధు లబ్ధిదారుల వినతి



ప్రజావారధి/మోత్కూరు

రెండో విడత దళితబంధు లబ్ధిదారులకు మంజూరైన నిధులపై ఫ్రీజింగ్ ఎత్తేసి గ్రౌండింగ్ చేయాలని కోరుతూ మోత్కూరు, అడ్డగూడూరు మండలాల దళితబంధు లబ్ధిదారులు శుక్రవారం మోత్కూరు వచ్చిన రాష్ట్ర సాంఘిక, సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023లో గత ప్రభుత్వం దళితులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో దళితబంధు పథకం అమలు చేయగా రెండో విడతలో తుంగతుర్తి నియోజకవర్గంలోని మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు చెందిన 254 మంది లబ్ధిదారులను ప్రభుత్వం ఎంపిక చేసిందని, అందులో భాగంగా రూ.10 లక్షల్లో వారి ఖాతాల్లో రూ.3 లక్షల చొప్పున జమ చేసిందని, ఈలోగా అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో లబ్ధిదారుల ఖాతాలను కలెక్టర్లు ఫ్రీజింగ్‌లో పెట్టారని తెలిపారు. 2025లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఎస్సీ కార్పొరేషన్ ఎండీ కూడా ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయగా మిగతా జిల్లాల్లో నిధులు విడుదల చేయగా, యాదాద్రి జిల్లాలోని మోత్కూరు, అడ్డగూడూరు మండలాల లబ్ధిదారుల ఖాతాలను మాత్రం నేటికీ ఫ్రీజింగ్‌లో పెట్టారని, దీంతో లబ్ధిదారులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు కలెక్టర్లు, ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, బ్యాంక్ ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తేసి గ్రౌండింగ్ చేసి ఉపాధి కల్పించాలని, మిగతా రూ.7 లక్షలు కూడా విడుదల చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి లక్ష్మణ్‌కుమార్ ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తేసి నిధులు విడుదలయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళితబంధు లబ్ధిదారులు బుషిపాక గణేష్, కొంపల్లి అంజయ్య, చెడిపల్లి రఘుపతి, బాలెంల నరేందర్, బండి వెంకటేష్, కూరెళ్ల రమేష్, బందెల శ్రీను, దాసరి నరేష్, ముక్కెర్ల రమేష్, బోనాల మహేందర్, దాసరి నరేష్, కొంపల్లి ప్రశాంత్, కొంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి

## చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటనర్సు



ప్రజావారధి/మోత్కూరు

జియో ట్యాగ్ కలిగిన ప్రతి చేనేత కార్మికునికి ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. చేనేత కార్మికులందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాసరావుకు శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాల ఫలితంగా వైఎస్.రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు ప్రభుత్వం వృధాప్య పింఛన్ మంజూరు చేసిందని తెలి పారు. గతంలో చేనేత సహకార సంఘాల సభ్యులకు,

## అడిషనల్ కలెక్టర్, చేనేత ఏడీకి వినతి



నిరుపేద చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు ఉండేవని, కాని వాటిని రద్దు చేయడంతో ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆసరా పింఛన్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి వయస్సుకు సంబంధించి ఆధార్ కార్డు, ఓటర్ ఐడి కార్డు ద్వారా నిర్ధారణ జరుగుతున్నప్పటికి చేనేత కార్మికులకు 50 సంవత్సరాలకే అర్హత కలిగి ఉన్నందున చేనేత గుర్తింపు కార్డు ఉంటేనే వర్తిస్తుందని అధికారులు చెప్పడంతో చేనేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్హత కలిగి జియో ట్యాగ్ ఉన్న ప్రతి చేనేత కార్మికునికి పింఛన్ అందేలా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు బోడ ఆంజనేయులు, చెన్న రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి

## ఎంఈవోకు ఏఐఎస్ఎఫ్ వినతి



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచి వసూలు చేస్తున్నాయని, ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జిట్ట గౌతం డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మోత్కూరు ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారని తెలిపారు. పుస్తకాలు, యూనిఫాం, ఇతరత్రా వాటి పేరు చెప్పి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలు తమ పిల్లలకు మంచి చదువు చెప్పించాలన్న లక్ష్యంతో ఎంతో కష్టపడి ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్నారని, వారికి అధిక ఫీజులు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా హక్కును వ్యాపారంగా మార్చడం నేరమని, ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ఫీజులు వసూలు చేయాలని, ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసి ఫీజులను సమీక్షించి వాటిని నియంత్రించాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తే ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు కరుణాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# మోత్కూరు బాలుర గురుకుల స్కూల్‌కు స్వంత భవనం మంజూరు చేయండి

## మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు ఏఐఎస్ఎఫ్ వినతి

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని బాలుర గురుకుల స్కూల్‌కు స్వంత భవనం మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మోత్కూరు వచ్చిన రాష్ట్ర సాంఘిక, సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ గత కొన్నేండ్లుగా బాలుర గురుకుల పాఠశాలకు స్వంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సరైన వసతులు లేని కారణంగా స్కూల్‌ను రెండుచోట్ల వేర్వేరు భవనాల్లో నిర్వహిస్తున్నారని, దీంతో విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులు కూడా అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. భవన నిర్మాణం కోసం గతంలో మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప సమీపంలో ప్రభుత్వ స్థలం పరిశీలించి ఎంపిక చేశారని, విద్యార్థుల ఇబ్బందులను తొలగించడానికి అన్ని వసతులతో స్వంత భవనం మంజూరు చేయాలని కోరారు. భవనం మంజూరు కోసం తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జానీ, నవీన్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



ప్రజావారధి/మోత్కూరు

గర్భిణిలు ప్రసవమయ్యే వరకు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మోత్కూరు సీడీపీవో నాజీ అన్నారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అంగన్‌వాడి కేంద్రం-1లో శుక్రవారం ప్రజాపాలన-ప్రగతి నివేదనలో భాగంగా మహిళా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణిలు పౌష్టికాహారం తీసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనుబంధ పోషకాహారం, బరువులు ఎత్తడంపై అవగాహన కల్పించారు. కిశోర్ బాలికలకు వెయ్యి రోజుల కార్యక్రమంపై వివరించి దానిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జోతమ్మ, అంగన్‌వాడి టీచర్లు ఎం.సునీత, బి.యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సిబ్బందికి యూనిఫాం అందజేత



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బందికి, కార్యాలయ సిబ్బందికి శుక్రవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ యూనిఫాం, పీపీఈ కిట్లు, పారిశుధ్య పనిముట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ సిబ్బందికి ప్రతినెలా వేతనాలు సక్రమంగా అందజేయాలన్నారు. సమస్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకుని ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, మున్సిపల్ కమిషనర్ కె.సతీష్ కుమార్, కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న, పన్నాల శ్రీవిద్య శ్రీనివాస్ రెడ్డి, గనగాని శైలజ నర్సయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మోత్కూరు–దత్తప్పగూడెం బీటీ రోడ్డు నిర్మించాలి




## దెబ్బతిన్న రోడ్డుపై బీజేపీ నిరసన

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు నుంచి ముశిపట్ల మీదుగా దత్తప్పగూడెం వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే రోడ్డును పునర్ నిర్మించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏనుగు జితేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో దెబ్బతిన్న దత్తప్పగూడెం రోడ్డుపై బీజేపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోత్కూరు నుంచి ముశిపట్ల మీదుగా దత్తప్పగూడెం వరకు ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా కంకర తేలి రెండు, మూడు అడుగుల గుంతలు పడ్డాయని, రోడ్డుపై వాహనదారులు ప్రయాణించకలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాల భారిన పడుతున్నారని తెలిపారు. రాత్రివేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణం నరక ప్రాయంగా మారిందన్నారు. ప్రజల భద్రత కోసం అధికారులు స్పందించి వెంటనే బీటీ రోడ్డు పునర్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుదే మధుసూదన్ యాదవ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు భీమిడి తిరుమల్ రెడ్డి, ఉపాధ్యక్షులు గుంటి సతీష్, నరేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.





# మోత్కూరులో పందుల స్వైర విహారం

- ఇళ్లలోకి వస్తున్న పందులు
- మలమూత్ర విసర్జనతో దుర్వాసన, పరిసరాల అపరిశుభ్రత
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పందుల పెంపకందారులు పందులను విచ్చలవిడిగా వదిలేయడంతో అవి ఇళ్ల మధ్య సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కేంద్రంలోని సినిమా థియేటర్, భారత్ గ్యాస్ కార్యాలయంతో పాటు తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో పందులు తిరుగుతున్నాయి. ఇళ్ల ఆవరణల్లోకి వస్తూ అపరిశుభ్రం చేస్తున్నాయని, మలమూత్రాల విసర్జనతో తీవ్ర దుర్వాసనతో పాటు రోగాల భారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. పందుల పెంపకందారులు పట్టణానికి దూరంగా పందులను దొడ్లలో పెంచుకోవాల్సి ఉండగా, ఇలా విచ్చలవిడిగా పట్టణంలో వదిలేయడమేటని, మున్సిపల్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, స్వచ్ఛ మున్సిపాలిటీ ఎక్కడ అని ప్రశ్నించారు. రానున్నది వానాకాలం కావడంతో పందుల సంచారంతో పట్టణంలో రోగాలు ప్రబలే ప్రమాదముందని, మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో పందుల సంచారాన్ని అరికట్టేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.